



# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 7 సంచిక : 185

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

శనివారం 2 డిసెంబరు 2023


## రాజ్‌భవన్‌లో నాగాలాండ్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు



**విజయవాడ,కలంకౌంటర్ :** విజయవాడ రాజ్‌భవన్‌లో శుక్రవారం నాగాలాండ్ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాజ్‌భవన్‌లోని దర్బార్ హాల్‌లో జరిగిన నాగాలాండ్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ నాగాలాండ్ రాష్ట్రం ఏడాది పొడవునా ఉత్సవాలతో నిండి ఉంటుందని, అన్ని తెగలు తమ తమ పండుగలను రంగులు, సంగీతం , నృత్యాలతో జరుపుకుంటారని అన్నారు. ఇది శక్తివంతమైన సంస్కృతులు, సంప్రదాయాల మొజాయిక్. పండుగల పండుగగా పిలవబడే హార్న్‌బిల్ పండుగ నాగాలాండ్ యొక్క గొప్ప సంస్కృతిని, జీవనశైలిని ప్రతిబింబిస్తుందన్నారు. ఆహ్లాదకరమైన వాతావణం, పచ్చని కొండలు, క్రాస్ క్రాసింగ్ నదులు, విడదీయబడిన సరస్సులు, శక్తివంతమైన సంస్కృతి కారణంగా రాష్ట్రం పర్యాటకుల స్వర్గధామం అన్నారు. రంగురంగుల హస్తకళలు , అనేక పండుగలు. 'ఏక్ భారత్ శ్రేష్ భారత్'లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని, దేశంలోని ప్రజలందరి మధ్య బలమైన బంధాన్ని, బంధాన్ని పెంపొందించడంతో పాటు వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల మధ్య పరస్పర అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గవర్నర్ తెలిపారు. ఈ సందర్భంగా వీఐటీ యూనివర్శిటీ ఫ్యాకల్టీ డా. ఆరెంకల కిచ్చు, నాగాలాండ్‌కు చెందిన ఎల్. బిల్లా హన్నా మాట్లాడారు. గుంటూరులోని నాగాలాండ్‌కు చెందిన సిమ్స్ కళాశాల విద్యార్థులు నాగ ఫ్యూజన్ జానపద నృత్యాన్ని ప్రదర్శించారు. రాకేష్ పబ్లిక్ స్కూల్ నుండి విద్యార్థులు గన్నవరంలోని డాక్టర్ సిఎస్ఎస్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ నుండి నాగా విద్యార్థులు అందించిన జానపద పాటలు అలరించాయి. ఈ కార్యక్రమంలో రాజ్‌భవన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న చంద్రబాబు దంపతులు

**తిరుమల,కలంకౌంటర్ :** తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. సతీమణి భువనేశ్వరితో కలిసి దర్శనం చేసుకున్నారు. అంతకుముందు వైకుంఠం కాంప్లెక్స్ వద్ద వారికి టీటీడీ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాటు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో చంద్రబాబు దంపతులకు అర్చకులు వేదాశీర్వచనం పలికారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను వారికి అందజేశారు. చంద్రబాబు వెంట మాజీ మంత్రి అమర్నాథరెడ్డితో పాటు పలువురు నేతలు ఉన్నారు. అలిపిరి వద్ద దాడి జరిగినప్పుడు శ్రీవారే కాపాడారని చంద్రబాబు అన్నారు. తిరుమల శ్రీవారి దర్శనానంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. త్వరలోనే నా కార్యాచరణ ప్రకటిస్తాను. ప్రజలకు సేవ చేసే శక్తి, సామర్థ్యాలు ఇవ్వాలని శ్రీవారిని వేడుకున్నాను. కష్టం వచ్చినప్పుడు స్వామివారిని మొక్కుకున్నాను. ధర్మాన్ని కాపాడాలని ప్రార్థించాను. ప్రపంచంలోనే భారతదేశం అగ్రస్థానంలో ఉండాలి. తెలుగుజాతి ప్రపంచంలోనే నంబర్ వన్‌గా



ఉండాలని కోరుకున్నట్లు చంద్రబాబు వెల్లడించారు.

## నెల్లూరు, మచిలీపట్నం మధ్య తీరం దాటనున్న తుపాను... కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసిన ఏపీ ప్రభుత్వం

**విజయవాడ, కలంకౌంటర్ :** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం రేపటికి తీవ్ర వాయుగుండంగా, ఎల్లుండికి తుపానుగా మారనుంది. ఇది డిసెంబరు 4 వరకు పశ్చిమ వాయవ్య దిశగా, ఆపై దాదాపు ఉత్తర దిశగా కోస్తాంధ్ర తీరానికి సమాంతరంగా పయనించి నెల్లూరు, మచిలీపట్నం మధ్య తీరం దాటే



అవకాశం ఉందని ఐఎండీ వెల్లడించింది. డిసెంబరు 3 నుంచి 5వ తేదీ వరకు భారీ వర్షాలు కురుస్తాయన్న నేపథ్యంలో, ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థలో స్టేట్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. తుపాను వేళ అత్యవసర సాయం, సమాచారం కోసం ఈ స్టేట్ కంట్రోల్ రూం ప్రారంభించారు. స్టేట్ కంట్రోల్ రూం ద్వారా సాయం, సమాచారం పొందగోరే వారు 1070, 112, 18004250101 నెంబర్లలో సంప్రదించాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ వెల్లడించింది. ఎప్పటికప్పుడు వాతావరణ పరిస్థితిని పర్యవేక్షిస్తుంటామని, జిల్లాల అధికార యంత్రాగాన్ని ఇప్పటికే అప్రమత్తం చేశామని తెలిపింది. తుపాను నేపథ్యంలో... రైతులు, కూలీలు, ప్రయాణికులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

## సినిమాలు ఆపేసినా...బెదిరించినా ఏనాడూ ఢిల్లీ పెద్దల సాయం కోరలేదు

### ● జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్



**గుంటూరు,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్‌లో జనసేనకు ఇవాళ ఆరున్నర లక్షల క్యాడర్ ఉందని, యువతే పెద్ద బలమని ఆపార్టీ అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగి న జనసేన విస్తృత స్థాయి సమావేశంలో పవన్ పాల్గొని ప్రసంగించారు. "మన పార్టీకి యువత బలం చూసి భాజపా పెద్దలే ఆశ్చర్యపోయారు. కార్యకర్తల చిత్తశుద్ధి వల్లే జనసేనకు ఢిల్లీలోనూ గుర్తింపు వచ్చింది. నన్ను, నా భావజాలాన్ని నమ్మే యువత వెంట వస్తున్నారు. ఇంతమంది అభిమానుల బలం ఉందని మనకు గర్వం రాకూడదు. పొరుగు రా ష్ట్రాల యువత కూడా మనకు మద్దతిస్తున్నారు. యువత ఆదరణ చూసే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో 8 చోట్ల పోటీ చేశాం. ఖమ్మం, మధిర, కూకట్‌పల్లి, దుబ్బాక ఎక్కడికెళ్లినా యువత పెద్ద ఎత్తున తరలివచ్చి మద్దతిచ్చారు" వైసీపీకి భావజాలం లేదు. ఎందుకోసం పనిచేస్తున్నారో వారికే తెలియదు. అన్న ముఖ్యమంత్రి కావాలి. అందుకోసం పనిచేస్తున్నాం అని చెబుతారు. నేను ఏం చేసినా దేశ సమగ్రత గురించే ఆలోచిస్తా. సమాజాన్ని ఎలా చూస్తామనే దానిపై జనసేనలో స్పష్టమైన అవగాహన ఉంది. హైదరాబాద్‌లో యువత ఓటింగ్‌కు దూరంగా ఉండటం చాలా బాధ కలిగించింది. నా సినిమాలు ఆపేసినా, నేను బసచేసిన హోటల్‌కు వచ్చి బెదిరించి ఇబ్బంది పెట్టినా మన పోరాటం మనమే చేసుకున్నాం తప్ప ఏనాడూ జాతీయ స్థాయి నాయకుల వద్దకు వెళ్లి మీ సహాయం కావాలని చేయిచాచి అడగలేదు. ఎందుకంటే ఇది మన నేల.. మన పోరాటం. కుదిరితే మనం వారికి బలం అవ్వాలి. కానీ, మనం బలం చూపించకపోతే వాళ్లు గుర్తింపు ఇవ్వరు. పోరాటం చేసే వాళ్లనే వారు గుర్తిస్తారు. స్వార్థం వదిలేయాలని నాయకులను కోరుతున్నా. చేసే పని, పోరాటమే మనకు గుర్తింపు ఇస్తుందని పార్టీ శ్రేణులకు పవన్ దిశానిర్దేశం చేశారు.

**వైసీపీకి భావజాలం లేదు :** వైసీపీకి భావజాలం లేదని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వ్యాఖ్యానించారు. శుక్రవారం జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నేతలతో పవన్ కళ్యాణ్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. పవన్ అధ్యక్షతన జరిగిన భేటీలో నాదెండ్ల మనోహర్, నాగబాబు, రాష్ట్రస్థాయి నేతలు పాల్గొన్నారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలపై పోరాట కార్యాచరణ ప్రకటించారు. ఓటర్ల జాబితాలో అవకతవకలపై జనసేన నేతలతో చర్చించారు. జనసేన, టీడీపీ ఉమ్మడిగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఈ సందర్భంగా చర్చించారు. అనంతరం పవన్ మీడియాతో మాట్లాడుతూ వైసీపీ వంటి పార్టీలకు ఈ పరిణామాలు ఇబ్బంది అనిపిస్తాయి. బీజేపీ, టీడీపీతో ఎలా కలుస్తారని నన్ను అంటున్నారు. అసలు నన్ను విమర్శించే అర్హత వైసీపీలో ఎవరికీ లేదు. నేను ఏ నిర్ణయం తీసుకున్నా అది ప్రజలు క్షేమం, రాష్ట్ర అభివృద్ధే ముఖ్యంగా తీసుకుంటాను. జనసేనకు యువతే పెద్ద బలం. రాష్ట్రంలో జనసేనకు ఆరున్నర లక్షల క్యాడర్ ఉంది. నేను మొదట్నుంచీ పదవులు కోరుకోలేదు. స్వార్థం వదిలేయాలని నేతలను కోరుతున్నాను. చేసే పని, పోరాటమే మనకు గుర్తింపు ఇస్తుంది. యువత ధైర్యంగా ముందుకు వచ్చి ఓటు వేయాలని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.






# సాగర్‌పై ఏపీ చర్యలు న్యాయమైనవే

● తెలుగు రాష్ట్రాల మధ్య వైరుధ్యాలు సృష్టించవద్దు ● రాష్ట్ర విభజ తర్వాత నదీ జలాలను కూడా విభజించారు ● ఆంధ్రా హక్కులను నీరు గార్చేలా మాట్లాడటం దారుణం ● తెలంగాణలో ఏ పార్టీనీ గెలిపించాల్సిన అవసరం మాకు లేదు ● ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



**గుంటూరు,కలంకౌంటర్ :** నాగార్జున సాగర్ డ్యామ్ అంశంపై తప్పుడు రాతలు రాస్తున్నారని, తెలుగు రాష్ట్రాల మధ్య వైరుధ్యాలు సృష్టించవద్దని మంత్రి అంబటి రాంబాబు కొన్ని మీడియా సంస్థలకు హితవు పలికారు. శుక్రవారం ఆయన తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈ వ్యవహారానికి రాజకీయపరమైన ముడిపెట్టడం తగదని, తెలంగాణలో ఏ పార్టీ వచ్చినా తమకు సంబంధం లేదని అన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఆ ప్రభుత్వంతో సత్సంబంధాలు ఉంటాయి. తెలంగాణలో మా పార్టీ లేదు. అక్కడ మేం పోటీ చేయలేదు. అలాంటప్పుడు ఏపార్టీని ఓడించాల్సిన అవసరం మాకు ఉండదు కదా. మా వాటాకు మించి ఒక్క నీటి బొట్టును మేము వాడుకోమ ని మంత్రి అంబటి స్పష్టం చేశారు.

**మేము చేపట్టిన చర్య న్యాయమైనది :** నాగార్జున సాగర్‌పై దండయాత్ర చేసినట్టు ఎల్లోమీడియా వార్తలు రాసింది. ఎవరిష్టం వచ్చినట్టు వారు రాశారు, టీవీల్లో చూపించారు. నిన్న మేము చేపట్టిన చర్య న్యాయమైనది, ధర్మమైనది. రాష్ట్ర విభజ తర్వాత నదీ జలాలను కూడా విభజించారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులు ఉమ్మడిగా ఉన్నాయి. బీజేపీ కిషన్ రెడ్డి నిన్న కొన్ని వాస్తవాలను కూడా అంగీకరించారు. కానీ ఏపీకి చెందిన కొన్ని పత్రికలు రాద్దాంతం చేశాయని మంత్రి అంబటి మండిపడ్డారు. వాస్తవానికి నది, డ్యాంలో సగం మాత్రమే తెలంగాణ పరిధిలో ఉంటుంది. కానీ ఈ చివరి వరకు మొత్తం తెలంగాణ ఆక్రమించింది. చంద్రబాబు హయాంలో చూస్తూ ఊరుకున్నారు. అప్పట్లో నీటి విడుదలకు కూడా తెలంగాణ ఒప్పుకోలేదు. మన భూభాగంలోకి మన పోలీసులు వెళ్తే దండయాత్ర ఎలా అవుతుంది. రామోజీరావు, రాధాకృష్ణ, చంద్రబాబు సమాధానం చెప్పాలి. తెలంగాణలో ఏదో పార్టీకి మేము మద్దతు తెలిపేందుకే ఇలా చేశామని కూడా వార్తలు రాయటం అవివేకం. మేము తెలంగాణలో పోటీ చేయటం లేదు. ఏ పార్టీకీ మద్దతు ఇవ్వటం లేదు. మన హక్కులను చంద్రబాబు తెలంగాణకు ధారపోశారు. ఓటుకు నోటు కేసు వలన ఇలా చేశారు. మన హక్కులను మనం కాపాడుకుంటే దండయాత్ర ఎలా అవుతుంది?" అని మంత్రి అంబటి ప్రశ్నించారు.

**ఆంధ్రా హక్కులను నీరు గార్చేలా మాట్లాడటం దారుణం :** చంద్రబాబు ప్రయత్నం చేసి ఫెయిల్ అయ్యారు. జగన్ ప్రభుత్వం చేసి సక్సెస్ అయింది. దీంతో టీడీపీ నాయకులు ఏమీ మాట్లాడలేక పోతున్నారు. పురంధేశ్వరి మాత్రం ఆంధ్రా హక్కులను నీరు గార్చేలా మాట్లాడటం దారుణం. 13వ గేటు వరకు మా హక్కు ఉంది. ఒక అడుగు ముందుకు వేసి మా హక్కులను మేము సాధించాం. చంద్రబాబు అప్పట్లో తెలంగాణకు లొంగిపోయారని మంత్రి దుయ్యబట్టారు. తెలంగాణ పోలీసులు నమోదు చేసిన కేసు చెల్లదు. ఘటన జరిగింది ఏపీలో ఐతే తెలంగాణ లో కేదు నమోదు ఏంటి?. కృష్ణా బోర్డుకానీ, కేంద్ర జలశక్తి కానీ ఎవరైనా వచ్చి పరిశీలించవచ్చు. తెలంగాణలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా స్వాగతిస్తాం. మా పార్టీ అక్కడ పోటీ చేయటం లేదు. తెలంగాణలో చంద్రబాబు కుల సంఘాలు కాంగ్రెస్ కు మద్దతు ఇచ్చాయి. రాహుల్, ప్రియాంక గాంధీ సభల్లో కాంగ్రెస్ జెండాలతో పోటీగా టీడీపీ జెండాలు కూడా కనిపించాయి. పవన్ కళ్యాణ్ పార్టీ అభ్యర్థులను ఓడించటానికి చంద్రబాబు కులం వారు భారీగా డబ్బు ఖర్చు పెట్టారు. తెలంగాణలో జనసేన అవసరం లేదు, ఏపీలో అవసరమా. పవన్ పిచ్చోడేమోకానీ, ఆయన కులం పిచ్చిది కాదని చంద్రబాబు గుర్తించాలని మంత్రి అంబటి వ్యాఖ్యానించారు.

**తెలంగాణలో ఏ పార్టీనీ గెలిపించాల్సిన అవసరం మాకు లేదు :** నాగార్జున సాగర్ వివాదంపై ఏపీ మంత్రి అంబటి రాంబాబు స్పందించారు. తాము తెలంగాణ భూభాగంలోకి వెళ్లలేదని చెప్పారు. నాగార్జునసాగర్ వద్ద గురువారం మేం చేసిన చర్య న్యాయమైనది, ధర్మమైనది, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుకునేది. రాష్ట్ర విభజన సమయంలో సాగర్ గేట్లను సమంగా పంచారు. ఏపీ గేట్లను కూడా తెలంగాణ అధికారులే ఆపరేట్ చేస్తున్నారు. కుడి కాల్వ నిర్వహణ తెలంగాణ చేతుల్లోకి ఎందుకు వెళ్లిందో ఆలోచించాలి. ఏపీ భూభాగంలోనూ తెలంగాణ పోలీసుల చెక్‌పోస్టులు ఉన్నాయి. మేం తెలంగాణ వారి గేట్లు ఆపరేట్ చేయలేదు. తాగునీటి కోసం కూడా తెలంగాణ అనుమతి తీసుకోవాలా? 2వేల క్యూసెక్కులు తాగునీటి కోసం విడుదల చేశాం. తెలంగాణలో మా పార్టీ లేదు. అక్కడ ఏ పార్టీనీ గెలిపించాల్సిన అవసరం మాకు లేదు. మా నీటిని విడుదల చేసుకునే స్వేచ్ఛ మాకు కావాలి. శ్రీశైలం ఎడమ విద్యుత్ కేంద్రాన్ని తెలంగాణ వాడుకుంటోంది. పరిమితికి మించి విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది. ఏపీ హక్కులను సాధించుకునే ప్రయత్నం చేస్తున్నాం. ఇప్పటికీ తెలంగాణ దయాదాక్షిణ్యాలపైనే మేం ఉన్నాం. తెలంగాణ వాటా మేం అడగం. మా వాటా వదులుకోం. ఇకపై ఏపీ వాటా వినియోగంపై మేమే నిర్ణయం తీసుకుంటామని అంబటి రాంబాబు వ్యాఖ్యానించారు.

## బాపట్ల జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడుగా తూనుగుంట్ల శ్రీనివాసరావు



**పిట్టలవాని పాలెం/బాపట్ల,కలంకౌంటర్ :** ఆంధ్ర ప్రదేశ్ ఆర్యవైశ్య అనుబంధ సంస్థ అయిన బాపట్లజిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుని ఎన్నిక వేదిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపం రేపల్లె లో జరిగింది. నూతనముగా ఏర్పడిన బాపట్ల జిల్లాకు ఆర్యవైశ్య సంఘ అధ్యక్షునిగా పిట్టల వాని పాలెం మండల కేంద్రం కు చెందినలి తూనుగుంట్ల శ్రీనివాసరావు ను ఎన్నుకున్నారు .ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారిగా రాష్ట్ర ఉపాధ్యక్షులు చుండూరు ఉమామహేశ్వరరావు పర్యవేక్షణలో ఎన్నికల పరిశీలకులుగా గుడివాడ వేణుగోపాల్ విచ్చేసారు . ఉమ్మడి గుంటూరు జిల్లా మాజీ అధ్యక్షులు బాపనపల్లి ప్రభాకర్ రావు , పెండ్యాల వెంకటరావు ,కార్యక్రమం లో ముఖ్య అతిధులు గా పాల్గొన్నారు. రేపల్లె పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు, కళ్యాణమండపం సెక్రెటరీ ఎమ్ బి ఎల్ నారాయణమూర్తి ,మండల అధ్యక్షుడు మండల ఉపాధ్యక్షులు ఆర్యవైశ్య ప్రముఖుల సమక్షంలో నిర్వహించారు.

## జాతీయ షూటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పతకం సాధించిన క్రీడాకారిణిని ప్రత్యేకంగా అభినందించిన ఎస్పీ మలిక గర్గ్..



**ఒంగోలు,కలంకౌంటర్ :** నవంబర్ 19 నుండి 26 వరకు భోపాల్ (మధ్యప్రదేశ్)లో జరిగిన 66వ జాతీయ 10 మీటర్ షూటింగ్ (పిస్టల్) జూనియ- ర్ మిక్సడ్ టీం విభాగంలో కాంస్య పతాకాన్ని సాధించిన కొత్తపట్నం మండలం, రంగాయపాలెం గ్రామానికి చెందిన ద్వారం ప్రణవి ని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మలికగర్గ్ ప్రత్యేకంగా అభినందించారు. అదే విధంగా జాతీయ గ్రూప్ A టీంకి సెలెక్ట్ అవడం, గోవాలో జరిగిన 37 వ నేషనల్ గేమ్స్ లో ఆల్ ఓవర్ ఇండియాలో 11 వ స్థానంలో నిలిచినందుకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మలికగర్గ్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో బ్రాంజ్ మెడల్ సాధించడం గర్వించదగ్గ విషయమని, భవిష్యత్తులో మరింత మంచి నైపుణ్యాన్ని కనబర్చి జిల్లాకు మంచి గుర్తింపు తీసుకురావాలని, కష్టపడి ఆడితే క్రీడల్లో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. క్రీడలతో పాటు విద్యలో రాణించాలని, కళాశాలకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. పోటీల్లో మంచి ప్రతిభను కనబరిచి అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడ ముఖ్యమేనని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో ప్రణవి తల్లిదండ్రులు జాలిరెడ్డి, ప్రగతి, షూటింగ్ జిల్లా సెక్రెటరీ ఖాదర్ వలీ తదితరులు పాల్గొన్నారు.

## టి.ఆర్.ఆర్ ప్రభుత్వ కళాశాలలో ఎయిడ్స్ అవగాహన కార్యక్రమం, ర్యాలీ




**కందుకూరు,కలంకౌంటర్ :** స్థానిక టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిసెంబర్ 1న ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా, ఎన్.ఎస్.ఎస్ ఒకటి,రెండో యూనిట్లు, రెడ్ రిబ్బన్ క్లబ్ ,జంతు శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో ఎయిడ్స్ పై అవగాహన సదస్సు,ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సంవత్సరం లెట్ ద కమ్యూనిటీస్ లీడ్ అనే ఇతివృత్తంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఎయిడ్స్ పై అవగాహన సదస్సులను ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తోంది. కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఎయిడ్స్ నిర్మూలన స్థితి ఎలా ఉంది, కౌమార దశ బాల బాలికలకు ఎయిడ్స్ గురించి అవగాహన ఎందుకు ఉండాలి, ఎయిడ్స్ నిర్మూలనలో యువత పాత్ర,ఎయిడ్స్ నియంత్రణపై ప్రతి ఒక్కరికి వ్యక్తిగతంగా ఎలాంటి అవగాహన ఉండాలి వంటి అంశాలపై వివిధ విభాగాల అధ్యాపకులు విద్యార్థులకు తెలియజేశారు. అవగాహన కార్యక్రమం అనంతరం సమాజంలోనూ మార్పు తీసుకురావడానికి కళాశాల విద్యార్థులు,అధ్యాపక బృందం ర్యాలీగా బయలుదేరి పట్టణంలోని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు నరేంద్ర, ఐక్యుఏసి కోఆర్డినేటర్ డాక్టర్ పి.రాజగోపాల్ బాబు, ఎన్ఎస్ఎస్ మొదటి యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కోటపాటి నరేష్ రాజా, ఎన్ఎస్ఎస్ రెండో యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ చీరాల శంకర రావు, జంతు శాస్త్ర విభాగాధిపతి మరియు రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఐ.అనూష, మహిళా సాధికారిత విభాగం అధ్యక్షురాలు డాక్టర్ షేక్ షానాజ్ బేగం, వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ తిరుపతి స్వామి, ఇతర అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు.

## కేసీఆర్‌ను గెలిపించడం కోసం జగన్ కుట్ర : సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



**హైదరాబాద్,కలంకౌంటర్ :** తెలంగాణలో పోలింగ్ జరుగుతుంటే నీటిని అడ్డం పెట్టుకుని నాగార్జునసాగర్ వద్ద జగన్ ప్రభుత్వం నాటకమాడిందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఆరోపించారు. కేసీఆర్‌ను గెలిపించడం కోసం ఆయన కుట్ర పన్నారని విమర్శించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో నారాయణ మాట్లాడారు. ఇన్నాళ్లూ జగన్ రాష్ట్ర ప్రయోజనాలను విస్మరించారు. ఆయనకు ఇప్పుడే నీళ్లు ఎందుకు గుర్తొచ్చాయి? జగన్ కుటిలయత్నాలు బెడిసికొట్టాయని నారాయణ వ్యాఖ్యానించారు. నాగార్జునసాగర్ ఆనకట్ట వద్ద పోలీసుల పహారా కొనసాగుతోంది. ఏపీవైపు భారీగా మోహరించిన పోలీసులు, ముళ్లకంచెల నడుమ డ్యామ్‌పై బందోబస్తు నిర్వహిస్తున్నారు. మరోవైపు తెలంగాణ పోలీసులు కూడా పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుంటున్నారు. నేడు ఇరు రాష్ట్రాలకు చెందిన ఐజీ స్థాయి అధికారులు సాగర్ చేరుకుని పరిస్థితిని అంచనా వేసే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే సుమారు నాలుగు వేల క్యూసెక్కుల నీటిని ఏపీ విడుదల చేసుకుంది.

## యువత భారీ బైక్ ర్యాలీ
## విజయవాడలో చంద్రబాబుకు ఘనస్వాగతం





**విజయవాడ,కలంకౌంటర్ :** తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుకు గన్నవరం విమానాశ్రయం నుంచి అడుగడుగునా ఘనస్వాగతం లభించింది. శుక్రవారం తిరుపతి నుంచి గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు టీడీపీ ఎంపీలు కనకమేడల రవీంద్రకుమార్, కేశినేని నాని పలువురు సీనియర్ నేతలు, ఉమ్మడి కృష్ణా జిల్లా తెలుగుదేశం శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఉండవల్లిలోని తన నివాసానికి బయలుదేరిన చంద్రబాబును పార్టీ శ్రేణులు భారీ ర్యాలీతో అనుసరించారు. గన్నవరం విమానాశ్రయం, జాతీయ రహదారి పరిసరాల్లో పోలీసులు భారీగా మోహరించారు. పోలీసులు ర్యాలీకి అనుమతి లేదంటూ టీడీపీ శ్రేణుల్ని నిలువరించే ప్రయత్నం చేశారు. పోలీసుల ఆటంకాలను లెక్కచేయకుండా యువత చంద్రబాబు వెంట కదిలారు. యార్లగడ్డ వెంకట్రావ్ ఆధ్వర్యంలో యువత భారీ బైక్ ర్యాలీ చేపట్టింది. నియోజకవర్గం మొత్తం భారీగా పూల వర్షంతో చంద్రబాబుకు ఘన స్వాగతం పలికారు

## ప్రభుత్వ ధనాన్ని కోట్లలో లూటీ చేసిన దొంగలను కఠినంగా శిక్షించాలి - కనపర్తి మనోజ్ కుమార్

● దొంగ కౌలురైతు కార్డులు సృష్టించి, ప్రభుత్వ ధనాన్ని కోట్లల్లో సొమ్ము చేసుకున్న వ్యక్తులు,వారికి సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ డిమాండ్



**కొండపి, కలంకౌంటర్ :** ప్రభుత్వ ధనాన్ని కోట్లలో లూటీ చేసిన దొంగలను కఠినంగా శిక్షించాలని కొండపి నియోజకవర్గ సమన్వయకర్త కనపర్తి మనోజ్ కుమార్ డిమాండ్ చేశారు.ప్రకాశం జిల్లాలో కొండపి నియోజకవర్గంలో పొన్నలూరు మండలంలోచెరుకూరు, పెరికిపాలెం,నాగిరెడ్డిపాలెం, ముండ్లమూరి వారిపాలెం తిమ్మపాలెం, వెంకుపాలెం గ్రామాల్లో భూయజమానులకు తెలియకుండా అదేవిధంగా చనిపోయిన రైతుల పేరు మీద దొంగ కౌలు రైతు పాస్ పుస్తకాలు సృష్టించి కొంతమంది వ్యక్తులు,వారికి సహకరించిన అధికారులు అందరు కలిసి కేంద్ర ప్రభుత్వం,రాష్ట్ర ప్రభుత్వం నుండి రైతులకు లభిస్తున్నటువంటి రైతు భరోసా, పిఎం కిసాన్, క్రాప్ ఇన్సూరెన్స్ పథకాల ద్వారా కోట్లల్లో సొమ్ము చేసుకున్నారు.ఇది కేవలం ఐదు గ్రామాల్లో మాత్రమే, కొండపి నియోజకవర్గంలో ఉన్నటువంటి ఆరు మండలాల్లో ఇంకెంతటి అవినీతి జరిగి ఉంటుందో మీరే అర్థం చేసుకోండి. ప్రభుత్వ ధనాన్ని అక్రమంగా సొమ్ము చేసుకున్న వ్యక్తులపై,వారికి సహకరించిన అధికారులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ నుంచి డిమాండ్ చేస్తున్నాం అని నియోజకవర్గ సమన్వయకర్త కనపర్తి మనోజ్ కుమార్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐయినాబత్తిన రాజేష్ (సింగరాయకొండ మండలం అధ్యక్షులు), గూడా శశిభూషణ్ (జరుగుమల్లి మండలం అధ్యక్షులు) మరియు జనసేన నాయకులు పాల్గొన్నారు.

## ఆడుదాం ఆంధ్ర కు సర్వం సిద్ధం



**పిట్టలవాని పాలెం(బాపట్ల జిల్లా),కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా ఉత్సవానికి బాపట్ల శాసనసభ్యులు రఘుపతి ఆదేశాల మేరకు ఖాజీపాలెం జడ్పీ హైస్కూల్ ఎంపిక కావడం జరిగింది. దీనిలో భాగంగా క్రీడ మైదానాన్ని పరిశీలించి, కావలసిన ఏర్పాట్లు గురించి చర్చించి, ఖాజీపాలెం గ్రామ సర్పంచ్ కుంతం అనూష ప్రసన్న రాజు ఆధ్వర్యంలో పనులు ప్రారంభించడం జరిగినది. ఈ కార్యక్రమంలో పిట్టల వారి పాలెం మండల కన్వీనర్ లీలశ్రీనివాస్ రెడ్డి గారు, ఖాజీ పాలెం కార్యదర్శి శ్రీనివాస రావు ,హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు భూపతి రావు , వ్యాయామ ఉపాధ్యాయులు కరిముల్లా , హై స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ గుమ్మడి సీతయ్య , కోమలి సర్పంచ్ శ్యామల నాగిరెడ్డి , కూసంపూడి దేవేందర్ రాజు , కాగిత యోహాను , కుంతం ప్రసన్న రాజు, తదితరులుపాల్గొన్నారు.

## గుండెపోటు తో హేమసుందర్ మృతి



**తిరువూరు,కలంకౌంటర్ :** తిరువూరులోని భారతి ఆయుర్వేద శాల నిర్వాహకుడు దురిశేటి హేమసుందర్ విజయవాడ సెంటినీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుండెపోటుతో మృతి చెందారు. పాత తిరువూరుకు చెందిన కృష్ణమాచారి పెద్ద కుమారుడైన హేమ సుందర్ విలేకరి గా కూడా కొనసాగుతున్నారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. హేమసుందర్ ఆకస్మిక మృతి పట్ల పలువురు ప్రముఖులు, వివిధ పార్టీల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

## వికలాంగులు అనాధలు వృద్ధులకు అన్నదానం దుప్పట్లు పంపిణీ




**పిట్టలవానిపాలెం (బాపట్ల జిల్లా),కలంకౌంటర్ :** పిట్టలవానిపాలెం మండలంలోని అల్లూరు గ్రామంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుడే సాహెబ్ మెమోరియల్ సొసైటీ అల్లూరు ఆధ్వర్యంలో ఈ నెల మూడో తారీకు ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు హెల్త్ కేర్ మెడికల్స్ అల్లూరు నందు వికలాంగులు అనాధలు నిరుపేద వృద్ధులకు ఉచిత అన్నదానం దుప్పట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సొసైటీ ఫౌండర్ ప్రెసిడెంట్ పజిల్ రెహమాన్ ఒక ప్రకటనలో తెలియజేశారు ఈ అవకాశాన్ని అల్లూరు గ్రామం మరియు పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా వారు కోరారు

## జనసేన - టిడిపి ప్రభుత్వం ఏర్పడటం తథ్యం



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** జనసేన టిడిపి ప్రభుత్వం ఏర్పడడం ఖాయమని జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డం రాజు ధీమావ్యక్తం చేశారు. జనసేన టిడిపి నేతలు సమన్వయంతో పని చేస్తున్నా రని అన్నారు జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డం రాజు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో రెండు పార్టీలు కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాయని అన్నారు. జనసేన టిడిపి శ్రేణులు కలిసికట్టుగా పట్టణ మండల స్థాయిలో ప్రజాక్షేత్రంలో చురుగ్గా కదులుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ భవిష్యత్తు గ్యారెంటీ కొరకు చంద్రబాబు కళ్యాణ్ బాబును ఆశీర్వదించాలని ప్రజలకు వివరిస్తున్నామని అన్నారు. లిడిసెంబర్ 2, 3 తేదీల్లో ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు బూత్ లెవెల్ అధికారులు ఓట్లను పరిశీలిస్తారని ప్రతి ఒక్కరు తమ ఓటు ఏ బూతులో ఉన్నదో ధ్రువీకరించుకుని లేనియెడల ఓటు నమోదు చేసుకోవాలని గడ్డం రాజు తెలిపారు. డెత్ డబ్లింగ్ ఓట్లను తొలగించి బూత్ లెవెల్ బౌండరీలను ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు.

## మానవత్వం చాటుకున్న వాలంటీర్ జహంగీరున్నిసా



**కందుకూరు,కలంకౌంటర్ :** కందుకూరుకు చెందిన చీదెళ్ళ రమణమ్మ అనే మహిళ అనారోగ్యం కారణంగా ఒంగోలు ఇందిరమ్మ కాలనీలో ఉంటున్నారు.శుక్రవారం ఒకటో తారీకు ఆమెకు సంబంధించినటువంటి వృద్ధాప్యపు పెన్షన్ ను వార్డు వాలంటీర్ జహంగీరున్నిస ఒంగోలుకు వెళ్లి ఆమెకు ఆ వృద్ధాప్య పెన్షన్ అందజేసి తన యొక్క ఔదార్యాన్ని మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, శాసనసభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డి ప్రజలకు చేస్తున్న సేవలో ఉడతా భక్తిగా తాను కూడా ఇలాంటి వృద్ధులకు సేవలు అందిస్తున్నానని ఆమె తెలిపారు. ఇలాంటి వృద్ధులకు సేవ చేయటం తనకెంతో సంతృప్తినిచ్చిందని ఆమె తెలిపారు.

# ఆర్యవైశ్యులకు ద్రోహంచేస్తున్న వెల్లంపల్లి - దర్శి హరికృష్ణ

**నెల్లూరు, కలంకౌంటర్ :** ఆర్యవైశ్యులకు మాజీ మంత్రి ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాస్ ద్రోహం చేస్తున్నాడని నెల్లూరు పార్లమెంటరీ తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగం అధ్యక్షులు దర్శి హరికృష్ణ ధ్వజమెత్తారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో హరికృష్ణ మాట్లాడుతూ ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాస్ ఆర్యవైశ్యులకు సేవ చేయాల్సింది పోయి ఆర్యవైశ్యులకు ద్రోహం చేస్తున్నారని అన్నారు. విజయవాడ దుర్గా ఘాట్లో కొంతమంది ఆర్యవైశ్యులు కార్తీక వన సమారాధన వ్రతాలు చేసుకుంటుంటే అడ్డుపడటం దుర్మార్గం దీనిని నెల్లూరు పార్లమెంట్ వాణిజ్య విభాగం పూర్తిగా ఖండిస్తుందని అన్నారు. అంతేకాదు మా నాయకుడు నారా చంద్రబాబు నాయుడు 14 సంవత్సరాల అధికారంలో వైశ్యులకు ఏమి చేయలేదని చెప్పి నోరు పారేసుకున్న వెల్లంపల్లి శ్రీనివాస్ జాగ్రత్త వాస్తవాలు తెలుసుకో నీకు విషయ జ్ఞానం లేదు అని చెప్పి హెచ్చరించారు. ఈ రాష్ట్రంలో ఆర్యవైశ్యులకు ఏదైనా మంచి జరిగింది అంటేఅది నారా చంద్రబాబునాయుడు ద్వారా మాత్రమే అని తెలియజేస్తున్నాను మీకు కావాలంటే 218 పేజీల బుక్కు మీకు ఇస్తా ఆర్యవైశ్యులకు తెలుగుదేశం పార్టీ నారా చంద్రబాబునాయుడు ,ఏమేం చేసిందో క్లియర్ గా తెలియజేస్తాం. ఆర్యవైశ్యులను అడ్డం పెట్టుకొని సంపాదించి ఆర్యవైశ్యుల్ని అంచివేసే ధోరణిలో ఉండటం దుర్మార్గం అయిన చర్య ఆర్యవైశ్య కులవృద్ధుడు రోశయ్య చనిపోతే కనీసం ఆయనకి నివాళులర్పించలేని దుస్థితి మీ పార్టీది నీది అని ఘాటుగా వ్యాఖ్యానించారు. సుమారు 35 నుంచి 45 మంది ఆర్యవైశ్యులపై దాడులు దౌర్జన్యాలు హత్యలు జరిగితే ఏనాడు స్పందించని మీరు ఆర్యవైశ్యులకు ఏం చేశారని నేను అడుగుతున్నా? ఆర్యవైశ్యులకి మొట్టమొదటిసారిగా ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేసి 30 కోట్లు మంజూరు చేసి పేద ఆర్యవైశ్యులను ఆదుకున్న ఘనత ఒక్క చంద్రబాబునాయుడు దే అని అన్నారు. ఈ రాష్ట్రంలో ఆర్యవైశ్యుల్ని కాపాడాలన్న ఆర్యవైశ్యులకు ఏమైనా చేయాలన్న ఒక్క తెలుగుదేశం పార్టీ చంద్రబాబు. నాయుడు గారు లోకేష్ బాబు మాత్రమే చేయగలరు. ఈ విధంగా మా నాయకుడు చంద్రబాబు మీద నువ్వు నోరు పారేసుకుంటే అబద్దాలు జాగ్రత్త ఈ సంగతి తేలుస్తామని చెప్పి నెల్లూరు పార్లమెంట్ వాణిజ్య విభాగంహెచ్చరించింది. ఈ కార్యక్రమంలో మెంటా వీరబ్రహ్మం గుప్తా, అబ్బాయి నాయుడు , మునీర్ , మీరా మొహిద్దిన్, పుదమాల రమేష్, గ్రంధి శ్రీధర్, మిర్చి రవి, ముస్తాక్ బాయ్, ఎం సి సుబ్రహ్మణ్యం, శ్రావణ చంద్ర, నారా శ్రీనివాసులు నాయుడు ,సుధాకర్ చౌదరి, రంగ మన్నార్ పాల్గొనడం జరిగింది.




# జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ 30 వేల ఆర్థిక చేయూత





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** బందరు మండలం ఎన్ గొల్లపాలెం పంచాయతీ పరిధిలోని తుమ్మలపాలెం గ్రామానికి చెందిన వాసుమిల్లి ఏడుకొండలు గిరిజ ప్రియా తండ్రి కూతురు ఇద్దరు ఇటీవల ప్రమాద బారిన పడి ఇద్దరు కూడా మంచానికే పరిమితమై ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న కుటుంబ పరిస్థితిని జనసేన పార్టీ నాయకుడు కర్ర రామకృష్ణ ద్వారా తెలుసుకున్న జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రమాదం జరిగిన విషయాన్ని బాధితులను అడిగి తెలుసుకున్నారు తండ్రి కూతురు ఇద్దరు తమ కాళ్లకు ఆపరేషన్ జరిగిన విషయాన్ని బండి రామకృష్ణ దృష్టికి తీసుకువచ్చి కన్నీటి పర్యంతమయ్యారు. చలించిన బండి రామకృష్ణ వెంటనే 30 వేల రూపాయలు ఆర్థిక సాయం బాధిత కుటుంబానికి అందించి పాప చదువు నిమిత్తం 20,000 వేల రూపాయలు ఇంటి అవసరాలకు 10,000వేల రూపాయలు జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామ్ తో కలిసి బాధితుని భార్య సుకన్యకు బండి రామకృష్ణ అందజేశారు.



తెలంగాణ రాష్ట్ర పీసీసీ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందిని శుక్రవారం తిరువూరు రాజుపేట అష్టలక్ష్మీ ఆలయంలో మహాలక్ష్మి యాగం నిర్వహించారు. తెలంగాణ లో కాంగ్రెస్ గెలుపు ఖాయమని ఆమె పేర్కొన్నారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు పర్వతనేని జగన్మోహన్ రావు, పల్లెపాటి శ్రీనివాసరావు, గంజా కృష్ణమోహన్, కొత్తగుండ్ల గోపాలకృష్ణ, కట్టమూడి నాగేశ్వరరావు, రామిశెట్టి గోపాలం తదితరులు పాల్గొన్నారు.
-మధిర,కలంకౌంటర్ :

# ఈ రాష్ట్రానికి మళ్లీ జగన్మోహన్ రెడ్డి అవసరం - పి టి ఆర్



**పొన్నలూరు, కలంకౌంటర్ :** ఈ రాష్ట్రానికి మళ్లీ జగన్మోహన్ రెడ్డి అవసరం అని జెసిఎస్ కన్వీనర్ పి టి ఆర్ అన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కొండపి నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు నాయకత్వంలో పొన్నలూరు మండలం ఉప్పలదిన్నె సచివాలయ మండలం ఆంధ్రప్రదేశ్ కి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం ఉప్పలదిన్నెలో సుమారుగా 13 కోట్ల రూపాయలతో అర్హులైన ప్రతి ఒక్కరికీ నవరత్న పథకాలు అందించి వారికి వివరించారు. జగనన్న ప్రభుత్వం అందించిన సంక్షేమ అభివృద్ధి లబ్ధి పట్టిక (బోర్డ్ ) ను ఆవిష్కరించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈఓఆర్డీ నాగేశ్వర అధ్యక్షతన జర్గింది ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొండబత్తినరావు జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పల్లపోలు బాలకోటి జేసీ మండల కన్వీనర్ పిల్లి తిరుపతిరెడ్డి(%జ్ఞ్తీ%) కట్టా కరుణాకరరావు మన్నెం రమణయ్య తుమ్మ మల్లికార్జునమన్నెం పెద్దవెంకటేశ్వర్లు కే శ్రీను సచివాలసిబంధి పాల్గొన్నారు.

# కోటి నిధులతో సింగరాయకొండ బస్టాండ్ అభివృద్ధి పనులు - బత్తుల సుప్రజారెడ్డి



**సింగరాయకొండ, కలంకౌంటర్ :** ఏపీఎస్ఆర్టీసీ నెల్లూరు జోనల్ బత్తుల సుప్రజా రెడ్డి విజ్ఞప్తి మేరకు సింగరాయకొండ బస్టాండ్ లో గతంలో ఉన్న నాలుగు ప్లాట్ఫామ్ లకు అదనంగా మరో నాలుగు ప్లాట్ఫాములను, క్యాంటీన్, మరుగుదొడ్లు ఆధునికీకరణ కొరకు రవాణా శాఖ అధికారులతో మాట్లాడి సుమారు కోటి రూపాయల నిధులతో సుప్రజారెడ్డి స్వీయ పర్యవేక్షణలో పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా సుప్రజా రెడ్డి మాట్లాడుతూ గత ఆరు నెలల నుండి అభివృద్ధి పనులను వేగవంతంగా చేస్తున్నామని తెలిపారు. ప్రయాణికుల సౌకర్యమే లక్ష్యంగా భావించి సింగరాయకొండ ఆర్టిసి బస్టాండ్ ను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసినందుకుముఖ్యమంత్రి వై.యస్. జగన్ మోహన్ రెడ్డి, అబ్బిరెడ్డి. మల్లికార్జున రెడ్డికి, ఆర్టీసీ ఎండి ద్వారకా. తిరుమలరావుకు, అధికారులకు సుప్రజారెడ్డి ప్రత్యేక తెలియజేశారు.

# తుఫాను అప్రమత్తంగా ఉన్నాం

- సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు పూర్తి సన్నద్ధంగా ఉన్నాం
- మత్స్య కారులు ఎవరూ సముద్రంలోకి చేపల వేటకు వెళ్లవద్దు
- కేబినెట్ కార్యదర్శికి వివరించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్. జవహర్ రెడ్డి
- ఢిల్లీ నుండి కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబ ఒడిషా, ఏపీ , తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల సిఎస్ లతో వీడియో సమావేశం



**విజయవాడ,కలంకౌంటర్ :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుఫానుగా మారనున్న ఉందని దానిని సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని ముందు జాగ్రత్తలతో పూర్తి సన్నద్ధంగా ఉన్నామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్. జవహర్ రెడ్డి కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబకు వివరించారు. తుఫాను కారణంగా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై శుక్రవారం ఢిల్లీ నుండి కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబ ఒడిషా, ఏపీ , తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల సిఎస్ లతో వీడియో సమావేశం నిర్వహించారు. విజయవాడ సిఎస్ క్యాంపు కార్యాలయం నుండి ఈ వీడియో సమావేశంలో పాల్గొన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్ జవహర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర,జిల్లా స్థాయిల్లో కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేశామని, ఇప్పటికే జిల్లా కలెక్టర్లను పూర్తి అప్రమత్తం చేశామన్నారు. వాతావరణ శాఖ అంచనా ప్రకారం అల్పపీడనం తుపానుగా మారనుందని దాని ప్రభావంతో రానున్న రెండు మూడు రోజుల్లో దక్షిణ కోస్తా ఆంధ్ర జిల్లాల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు,మిగతా కోస్తా జిల్లాల్లో ఒక మాదిరి నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. 4వ తేదీ సోమవారం చెన్నై- మచిలీపట్నంల మధ్య తుఫాను తీరాన్ని తాకే అవకాశం ఉందని ఆసమయంలో 80 నుండి 100 కి.మీల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందన్నారు. తుఫాను కారణంగా శనివారం ఉదయం నుండి మత్స్య కారులు ఎవరూ సముద్రంలోకి చేపల వేటకు వెళ్లవద్దని ఇప్పటికే హెచ్చరించామని సిఎస్ జవహర్ రెడ్డి చెప్పారు. తుఫాను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు వీలుగా 2 ఎన్డీఆర్ఎఫ్,6 ఎస్డిఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచామని కేబినెట్ కార్యదర్శికి సిఎస్ వివరించారు. అదే విధంగా పౌరసరఫరాల విభాగం ద్వారా వివిధ నిత్యావసర సరుకులను పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచామని అన్నారు. నీటి పారుదల,ఆర్ అండ్బి, పంచాయితీ రాజ్ శాఖలను పూర్తిగా అప్రమత్తం చేసి బలహీ నంగా ఉన్న వివిధ ఏటి గట్లు,వంతెనలు తదితర ప్రాంతాల్లో ప్రత్యేక ముందుస్తు చర్యలు తీసుకోవాల్సిందిగా ఇప్పటికే ఆయా అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. అలాగే రక్షిత మంచి నీటి సరఫరా,విద్యుత్,టెలికం, మున్సిపల్,వైద్య ఆరోగ్య తదితర శాఖల అధికారులను కూడా పూర్తిగా అప్రమత్తం చేశామని చెప్పారు. తుఫాను ప్రభావంతో ఎలాంటి పరిస్థితులు తలెత్తినా సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తంగా పూర్తి సన్నద్ధతతో ఉందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.జవహర్ రెడ్డి కేబినెట్ కార్యదర్శికి వివరించారు. ఈ వీడియో సమావేశంలో కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబ మాట్లాడుతూ తుఫాను వల్ల ప్రాణ,ఆస్థి నష్టాలను కనిష్ఠ స్థాయికి తెచ్చేందుకు పూర్తి అప్రమత్తంగా ఉండాలని నాలుగు రాష్ట్రాల సిఎస్ లకు సూచించారు. ఎన్డిఆర్ఎఫ్,కోస్టు గార్డు,నేవీ ఎయిర్ ఫోర్స్, టెలికం తదితర కేంద్ర ప్రభుత్వ శాఖలు ఏజెన్సీలు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయంతో ఉండి వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఆయన ఆదేశించారు. ఈ వీడియో సమావేశంలో డిజిపి కె.వి.రాజేంద్రనాథ్ రెడ్డి, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మరియు సిసిఎల్ఏ జి.సాయి ప్రసాద్,అదనపు డిజి శాంతి భద్రతలు ఎస్.బాగ్చి, ఎస్ఇబి డైరెక్టర్ రవి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. కాగా 1వ తేదీ ఉదయం నాటికి రాష్ట్రం లోని ఎస్పిఎస్ నెల్లూరు జిల్లాలోని ఇందుకూరు పేటలో 76.2 మీ.మీలు,నెల్లూరు అర్బన్ 66.4మి.మీలు, కోవూరు 60, నెల్లూరు గ్రామీణం 57.8, పొదలకూరు 46.8,దగదర్తి 46.4, తోటపల్లి గూడూరులో 42.8 మీ.మీల వర్షపాతం నమోదైంది. అదే విధంగా తిరుపతి జిల్లా బుచ్చినాయుడు ఖండ్రిగలో 54.8,సూళ్లూరుపేటలో 53.8, నాగలపురం మండలంలో 45.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

# చంద్రబాబు తో కలసి శ్రీవారిని దర్శించు కొన్ని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్



**కందుకూరు,కలంకౌంటర్ :** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు గారితో కలిసి కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న కుప్పం నియోజకవర్గ సమన్వయ కమిటీ చైర్మన్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, తెలుగుదేశం పార్టీ నాయకులు బెజవాడ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



తిరువూరు శ్రీ కోదండరామ స్వామి దేవాలయంలో పునర్వసు నక్షత్రం సందర్భంగా తిరువంజనం కార్యక్రమం మమ్మీ-డాడి రెడీమేడ్ వారి సహకారంతో జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి నూతన వస్త్రాలు అర్చకుల ద్వారా సమర్పించారు. తదుపరి వారిని అర్చక స్వామి వారు శేష వస్త్రాలతో సత్కరించారు.
-తిరువూరు,కలంకౌంటర్ :

# కోటేశ్వర థియేటర అధినేత కల్లూరి శివకృష్ణకు పిహెచ్డి పురస్కారం..



**కందుకూరు,కలంకౌంటర్ :** పట్టణానికి చెందిన మాజీ మున్సిపల్ చైర్మన్ కల్లూరి కోటేశ్వరరావు కుమారుడు, కోటేశ్వర థియేటర్ యజమాని కల్లూరి శివకృష్ణ మల్లినేని లక్ష్మయ్య ఉమెన్స్ ఇంజనీరింగ్ కాలేజ్, గుంటూరు సిఎస్సి విభాగంలో అధ్యాపకుని గా పనిచేస్తూ... సిఎస్సి విభాగానికి చెందిన మిషన్ లెర్నింగ్ విభాగంలో ఎలక్ట్రికల్ అనాలసిస్ అండ్ బిజినెస్ ఫర్ కాస్టింగ్ బై మిషన్ లెర్నింగ్ మెథడ్ మీద శోధన చేసినందుకు గాను ‘ శ్రీ సత్య సాయి యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ అండ్ మెడికల్ సైన్స్ సెహోర్’ మధ్యప్రదేశ్ యూనివర్సిటీ వారు డాక్టర్ పురస్కరించబడినది. డాక్టరేట్ వచ్చిన సందర్భంగా కోటేశ్వర థియేటర్ సిబ్బంది, ఆయన మిత్రుడు బంధువులు అభినందనలు తెలిపారు.

# యువనేతను కలిసిన కాకినాడ న్యాయవాదులు





**కాకినాడ,కలంకౌంటర్ :** కాకినాడ సంతచెరువు సెంటర్ లో కాకినాడ న్యాయవాదులు యువనేత లోకేష్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇటీవల వైసిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ టైటిల్ యాక్ట్ చట్ట వ్యతిరేకమైనది. ఈ చట్టం వల్ల ప్రజల ప్రైవేటు ఆస్తులకు రక్షణ కరువవుతుంది. ఈ చట్టం న్యాయవిరుద్ధమైనది, చట్టం ముసుగులో ప్రభుత్వం మరో భూదందాకు తెరలేపింది. మీరు అధికారంలోకి వచ్చాక ఈ చట్టాన్ని రద్దు చేయాల్సింది కోరుతున్నాము. జూనియర్ న్యాయవాదులు దయనీయ స్థితిలో ఉన్నారు. జగన్ ప్రభుత్వం లా నేస్తం కింద నెలకు రూ.5 వేల రూపాయలు ఇస్తామని చెప్పి, ఆరునెలలకు ఒకసారి మాత్రమే అరకొరగా నిధులు విడుదల చేస్తోంది. లా నేస్తం మొత్తాన్ని రూ.8వేలకు పెంచి, అర్హులైన ప్రతి ఒక్కరికీ అమలుచేయాలని, జూనియర్ న్యాయవాదులకు జీవిత బీమా కల్పించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. నారా లోకేష్ స్పందిస్తూ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అడ్డగోలు చట్టాలతో భూదోపిడీని వ్యవస్థీకృతం చేయాలని చూస్తోంది. ప్రజల ఆస్తులను కొట్టేసేందుకే ప్రభుత్వం ల్యాండ్ టైటిల్ యాక్ట్ తెచ్చింది. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే చట్టవిరుద్ధమైన ల్యాండ్ టైటిల్ యాక్ట్ ను రద్దుచేస్తాం. జూనియర్ న్యాయవాదులకు క్రమం తప్పకుండా భృతితోపాటు జీవితబీమా సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

# ఆడుదాం ఆంధ్రా ద్వారా క్రీడాప్రతిభకు అవకాశాలు - హెూంమంత్రి తానేటి వనిత



**కొవ్వూరు,కలంకౌంటర్ :** క్రీడాకారుల్లో దాగియున్న ప్రతిభను వెలికితీసి జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దేంకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమాన్ని నిర్వహి స్తోందని రాష్ట్ర హెూం మరియు విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత తెలిపారు. ఈ క్రీడా పోటీలను గ్రామ, మండల, నియోజ కవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో డిసెంబర్ 15వ తేదీ నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వం-కూ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆడుదాం ఆంధ్రా కార్య క్రమాన్ని అందరూ విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం హెూంమంత్రి క్యాంపు కార్యాలయంలో ఒక వీడియో సందేశాన్ని విడుద ల చేశారు. ఈ సందర్భంగా హెూంమంత్రి తానేటి వనిత మాట్లాడు తూ... గ్రామీణ స్థాయి నుంచి క్రీడాకారుల్లో ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలోని ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పోటీలను నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. యువత అంతా క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఆరోగ్యంగా ఉండాలని, శరీర ధృడత్వం పెంచుకోవాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం ద్వారా క్రీడాకారుల జీవనశైలి లో మార్పులు వస్తాయన్నారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా క్రీడా మైదానాల్లో క్రికెట్, వాలీబీల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ వంటి ప్రముఖ క్రీడలతో పాటు స్థానిక ప్రాధాన్య మున్న క్రీడలకు సంబంధించిన పోటీలు జరుగుతాయన్నారు. 15 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. అధిక సంఖ్యలో క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శి ంచేందుకు క్రీడాకారుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలన్నారు. ప్రతి గ్రామం నుంచి ఏదో ఒక క్రీడలో క్రీడాకారులు తప్పనిసరిగా పోటీలో పాల్గొనెలా యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. క్రీడాకారులు 1902 నంబర్‌కు కాల్‌చేసి లేదా తమ సమీపంలోని సచివాలయం నందు రిజిస్ట్రేషన్ చేసుకుని పాల్గొనవచ్చని తెలిపారు. క్రీడాపోటీలను విజయవంతం చేయడంతో పాటు ఆడుదాం ఆంధ్రాలో కొవ్వూరు నియోజకవర్గానికి మంచి గుర్తింపు తీసుకొచ్చే విధంగా క్రీడాకారులు తమ ప్రతిభను చాటాలని కొవ్వూరు ఎమ్మెల్యేగా ఆమె విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా క్రీడాకారులందరూ బాగా ఆడి.. తమ సత్తాను చాటి చెప్పాలని, ధైర్యంగా ఆడి విజేతలు కావాలని రాష్ట్ర యువత అంతటికీ హెూంమంత్రి తానేటి వనిత 'ఆల్ ది బెస్ట్' అంటూ శుభాకాంక్షలు తెలిపారు.

# నారా లోకేష్ ను కలిసిన దళిత సత్తా సంఘం ప్రతినిధులు





**కాకినాడ,కలంకౌంటర్ :** కాకినాడ వైఎస్సార్ బ్రిడ్జి వద్ద ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా దళిత సత్తా ప్రతినిధులు యువనేత లోకేష్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎస్సీ, ఎస్టీలకు టీడీపీ హయాంలో ఇచ్చిన సంక్షేమ పథకాలను జగన్మోహన్ రెడ్డి తుంగలో తొక్కాడు. వైఎస్ రద్దు చేసిన ఎన్.ఎస్.ఎఫ్.డీ.సీ, ఎన్.ఎస్.కె.ఎఫ్.డీ.సీ పథకాలను చంద్రబాబు పునరుద్ధరించారు. జగన్ అధికారంలోకి వచ్చాక ఈ పథకాలను కూడా రద్దు చేశాడు. వైసీపీ పాలనలో దళితులపై దమనకాండ, హత్యలు, దురాగతాలు పెరిగిపోయాయి. దళితులకు జగన్ పాలనలో అడుగడుగునా అన్యాయమే జరుగుతోంది. మీరు అధికారంలోకి వచ్చాక ఎస్సీ కార్పొరేషన్ కు నిధులిచ్చి ఆదుకోవాలి. జగన్ రద్దు చేసిన సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలి. ఎస్సీ,ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులను ప్రతియేటా భర్తీ చేయాలి. జగన్ దళితుల వద్ద లాక్కున్న అసైన్డ్ భూములు 11వేల ఎకరాలను తిరిగి ఇప్పించాలని కోరారు. నారా లోకేష్ స్పందిస్తూ దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన జగన్ దళితులను ఊచకోత దమనకాండ సాగిస్తున్నారు. దళితులను చంపి డోర్ డెలివరీ చేసే వైసీపీ నేతలను వెంటేసుకుని తిరుగుతున్నాడు. దళితులకు సంబంధించిన 27సంక్షేమ పథకాలు రద్దు చేసి ద్రోహం చేశాడు. దళితుల సంక్షేమానికి ఖర్చు చేయాల్సిన రూ.28,147 కోట్ల సబ్ ప్లాన్ నిధులను దారిమళ్లించిన దళిత ద్రోహి జగన్. టిడిపి-జనసేన అధికారంలోకి వచ్చాక ఎస్సీ కార్పొరేషన్ ను బలోపేతం చేస్తాం. జగన్ రద్దు చేసిన సంక్షేమ పథకాలను పునరుద్ధరిస్తాం. ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీచేస్తామని హామీ ఇచ్చారు.

# తుఫానుకు ముందస్తు చర్యలు చేపట్టండి..

- రైతులు తమ పంటను భద్రపరుచుకోవాలి
- మత్స్యకారులెవరూ వేటకు వెళ్ళరాదు - జిల్లా కలెక్టర్



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** రాబోయే మియాచౌంగ్ తుఫాను వల్ల జిల్లాలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా వివిధ ప్రభుత్వ శాఖాధికారులు సమన్వయంతో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. ఈ నెల 3 నుంచి 6వ తేది వరకు సంభవించనున్న తుఫాను హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలో తీసుకోవలసిన జాగ్రత్తలపై శుక్రవారం సాయంత్రం ఆయన తన చాంబర్లో వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. జిల్లాకు తుఫాను ముప్పు పోయేంతవరకు జిల్లా అధికారులు ఎవరూ సెలవులు పెట్టరాదని, నిత్యం అందుబాటులో ఉండటంతో పాటు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తుఫాను ముప్పును ఎదుర్కొనేందుకు ఖర్చుకు వెనుకాడ వద్దని, ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆగ్నేయ నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం సోమవారం సాయంత్రం చెన్నై-మచిలీపట్నం మధ్య తీరం దాటే అవకాశం ఉందని, దీని ప్రభావంతో ఆదివారం నుంచి జిల్లా వ్యాప్తంగా వర్షాలు, అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందన్నారు. ఈనెల 3వ తేదీ నుంచి 6వ తేదీ వరకు తుఫాను ప్రభావం ఉంటుందని, ఈ నేపథ్యంలో రైతులందరూ తమ పంటను భద్రపరుచుకునేలా వ్యవసాయ శాఖ అధికారులు ముందస్తుగానే అప్రమత్తం చేయాలని చెప్పారు. ఇప్పటికే నూర్పిళ్ళు జరిగిన పంటను త్వరితగతిన మిల్లులకు తరలించాలని, పనల మీద ఉన్న పంటను కుప్పలు వేసుకునేలా చేస్తూ, కోయని పంటను వాయిదా వేసుకునేలా రైతులను అప్రమత్తం చేయాలని సూచించారు. ఇందుకు గ్రామాలలో ప్రచార మాధ్యమాలు, చాటింపుల ద్వారా హెచ్చరికలు చేయాలన్నారు. తీర ప్రాంత గ్రామాలలో ఉన్న తుఫాను షెల్టర్లను గుర్తించి, తుఫాను బాధితులు అక్కడ ఉండేందుకు వీలుగా సౌకర్యాలను పరిశీలించుకోవడంతో పాటు ఆహారం, తాగునీరు ఏర్పాటు చేసుకునే విధంగా అధికారులను సిద్ధం చేసుకోవాలని బందరు ఆర్ డి ఓ కు సూచించారు. తుఫాను తీవ్రతను బట్టి లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని తుఫాను రక్షిత భవనాల వద్ద తాగునీరును సిద్ధం చేసుకోవాలని, తాగునీరు కలుషితం కాకుండా క్లోరినేషన్ చేయాలని, ఓవర్ హెడ్ ట్యాంకులకు నీటిని ఎక్కించేందుకు జనరేటర్లను సైతం సిద్ధం చేసుకోవాలని గ్రామీణ నీటిపారుదల శాఖ అధికారులకు చెప్పారు. వెల్నెస్ సెంటర్లతో పాటు తుఫాను రక్షిత భవనాల వద్ద అవసరమైన మందులను, వైద్య సిబ్బందిని ఏర్పాటు చేయాలని వైద్యాధికారులకు సూచించారు. గర్భిణీ స్త్రీలు, తీవ్రమైన వ్యాధిగ్రస్తులను ముందుగానే ప్రభుత్వ ఆసుపత్రిలో ఉంచాలన్నారు. మత్స్యకారులు ఎవరూ సముద్రంలో వేటకు వెళ్ళరాదని, సముద్రంలో ఉన్న బోట్లను వెనక్కి రప్పించే విధంగా సాగర మిత్రలను అప్రమత్తం చేయాలన్నారు. బోట్లు, పడవలు, వలలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా సురక్షితమైన ప్రాంతంలో భద్రపరచుకునేలా అవగాహన పరచాలని మత్స్య శాఖ అధికారులకు సూచించారు. తుఫాను తీవ్రతను బట్టి పాఠశాలలకు సెలవులు ప్రకటించటంపై నిర్ణయం తీసుకుంటామని, నదులు దాటి వెళ్లే విద్యార్థుల తల్లిదండ్రులు సైతం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాల సమయంలో పడిపోయిన చెట్ల తొలగింపు, విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించడంలో ఆయా శాఖల అధికారులు వేగంగా స్పందించాలని, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఎలాంటి ప్రాణ నష్టం సంభవించకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు.

# ప్రజా వ్యతిరేక చట్టం 27/23 ను వెంటనే రద్దు చేయాలి...

- మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ...



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** న్యాయస్థానాల విస్తృత అధికారాలను, ప్రజల హక్కులను కాలరాచే ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ 27/23 తక్షణమే రద్దు చేయాలని మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ రాష్ట్ర ముఖ్యమంత్రిని డిమాండ్ చేశారు. శుక్రవారం మచిలీపట్నంలో విలేకరులతో మాట్లాడుతూ కక్షిదారులు యొక్క ఆస్తులు సంబంధించి సివిల్ కేసులను సివిల్ కోర్టులో దాఖలు చేయకుండా కోర్టు పరిధిని తీసివేస్తూ, సివిల్ తగాదాలు ఉన్న భూములు పై విచారించే హక్కును అధికారులకు కట్టబెట్టే ఈ చీకటి చట్టం పట్ల దోపిడీకి అవకాశం ఏర్పడుతుందని బాలాజీ అన్నారు. ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ లేకుండా ఏకపక్షంగా జారీ చేసిన చీకటి జీవో 27/23ను అని, రాజకీయ పార్టీలు వ్యతిరేకించాలని బాలాజీ పిలుపునిచ్చారు. ప్రజల యొక్క ఆస్తులు మీద పెత్తనం చేసే హక్కు ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలకు లేదన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని అన్నారు. అధికారులకు రాజ్యాంగ వ్యతిరేక అధికారాలను కట్టబెడితే ఏ పార్టీ అధికారం ఉంటే ఆ పార్టీ ప్రజల ఆస్తులను దోచుకోవడానికి అవకాశం ఏర్పడుతుందని బాలాజీ అన్నారు. ఇప్పటికే అనంతపురం పశ్చిమగోదావరి జిల్లా తూర్పుగోదావరి జిల్లాలో బార్ అసోసియేషన్లు రాబోయే వారం రోజుల్లో నిరసన కార్యక్రమాలకి పిలుపు ఇవ్వడం జరిగిందని కృష్ణాజిల్లాలో కూడా ఈ ఉద్యమానికి న్యాయవాదుల సిద్ధమవుతున్నారని బాలాజీ తెలియజేశారు. తక్షణమే యాక్ట్ ను రద్దు పరచాలని సివిల్ కోర్టుకు ఉన్న హక్కులకు భంగం కలగకుండా ప్రజల యొక్క చట్టపరమైన, రాజ్యాంగపరమైన హక్కులను హరించి వేసే చట్టానికి ఫుల్ స్టాప్ పెట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రిని బాలాజీ డిమాండ్ చేశారు. ప్రజా వ్యతిరేక చట్టాలను, చీకటి చట్టాలను ప్రజాస్వామివాదులందరూ వ్యతిరేకించాలని బాలాజీ అన్నారు.




# ఆడుదాం ఆంధ్రా..

- 'ఇది అందరి ఆట, యువత భవిష్యత్తుకు బంగారు బాట, మీలో ఉన్న ప్రతిభను వెలికితీసే వేట'
- క్రీడలు, యువజన శాఖ మంత్రి ఆర్. కె రోజా
- గ్రామీణ స్థాయి నుంచి క్రీడాకారులను ప్రోత్సహించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం : శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి



**విజయవాడ,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యువత కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమ వివరాలను తెలియజేస్తూ క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా, శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి 'ఆడుదాం ఆంధ్రా' ప్రోమో, బ్రోచర్ ను ఆవిష్కరించారు. శుక్రవారం విజయవాడలోని ఇందిరా గాంధి స్టేడియంలో శాప్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి రోజా మాట్లాడుతూ 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమ వివరాలను వెల్లడించారు. ప్రజల్లో ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడం మరియు యువత ప్రతిభను గుర్తించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింత ప్రోత్సహించేందుకు సిద్ధం చేసిన వేదికే 'ఆడుదాం ఆంధ్రా' అని పేర్కొన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం కింద రాష్ట్ర వ్యాప్తంగా 51 రోజుల్లో 3 లక్షల మ్యాచ్ లు, అంటే 15,004 గ్రామ,వార్డు సచివాలయాల్లో 1.5 లక్షల మ్యాచ్ లు, 680 మండలాల్లో 1.42 లక్షల మ్యాచ్ లు, 175 నియోజకవర్గాల్లో 5,250 మ్యాచ్ లు, 26 జిల్లాల్లో 312 మ్యాచ్ లు, రాష్ట్రస్థాయిలో 250 మ్యాచ్ లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

**క్రీడల్లో ఆడపిల్లలు ఆడుపులులుగా మారేలా "ఆడుదాం ఆంధ్రా"ను సద్వినియోగం చేసుకువాలి: మంత్రి రోజా**

"క్రీడా మంత్రిగా నా జీవితంలో ఇదొక సంతోషకరమైన రోజు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఏ సీఎం ఆడుదాం ఆంధ్రా వంటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టలేదు. క్రీడల పట్ల ఆసక్తి,యువత పై నమ్మకం ఉన్న వ్యక్తి జగన్ మోహన్ రెడ్డి. చరిత్రలో కనీవినీ ఎరుగని కార్యక్రమం ఇది. సీఎం జగన్ మోహన్ రెడ్డి ఆలోచనలను కార్యరూపం దాల్చడంలో మేం అదృష్టవంతులం. 72 గంటల్లో 5 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇంతమంచి అవకాశం మళ్లీ వస్తుందో లేదో ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలి. కోటి మంది వరకూ రిజిస్ట్రేషన్స్ చేసుకుంటారని భావిస్తున్నాం. ఏపీని ఆటల ఆంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దాలనేదే జగన్ మోహన్ రెడ్డి లక్ష్యం. ఆడపిల్లలు కూడా ఉత్సాహంగా పాల్గొనాలని మంత్రి రోజా పిలుపునిచ్చారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి-ంలో 51 రోజుల పాటు క్రీడా సంబరం సాగనుందని మంత్రి రోజా పేర్కొన్నారు. ఈ టెక్నాలజీ యుగంలో 15 ఏళ్లు నిండిన యువతను క్రీడల్లో ప్రోత్సహించాలనే వారి ఆరోగ్యాన్ని పరిరక్షించాలనే ఉద్దేశంతోనే ముందుకు సాగుతున్నమని, యువత క్రీడల ప్రాముఖ్యతను తెలుసుకోవాలనేదే ప్రభుత్వం ప్రధానలక్ష్యమని అన్నారు. డిసెంబర్ 15 నుంచి ఫిబ్రవరి 3 వరకూ టోర్నమెంట్ జరగుతాయని తెలిపారు. మొత్తం 5 క్రీడాంశాల్లో క్రికెట్,వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ డబుల్స్ క్రీడల్లో పోటీలు జరుగుతాయని వెల్లడించారు. ఏ రాష్ట్రంలోనూ ఎవరూ చేయలేనంతగా సీఎం జగన్ పనిచేస్తున్నారని అన్నారు. రాష్ట్రస్థాయిలో క్రీడలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. రెండేళ్లు కోవిడ్ కారణంగా ఎంతో నష్టపోయామని అయినా చంద్రబాబులాగా భయపడి జగన్ మోహన్ రెడ్డి పారిపోలేదని ప్రతి ఒక్కరికి అన్ని విధాలా న్యాయం చేస్తున్నారని అన్నారు. సంక్షేమంతో పాటు అన్నీ అందరికీ అందేలా చేస్తున్న ఒకే ఒక్కరు జగన్ అని ఉద్ఘాటించారు.

**"ఆడుదాం ఆంధ్రా" రాష్ట్ర చరిత్రలోనే అతిపెద్ద క్రీడా సంబరం : శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి**

రాజకీయ నాయకులు ఎన్నికలప్పుడే వస్తారనే అభిప్రాయం ప్రజల్లో ఉండేదని, కానీ సీఎం జగన్ ఏపీలో ఒక ట్రెండ్ ను సృష్టించారని శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడిన దగ్గర్నుంచి ప్రతీ నాయకుడిని నిత్యం జనాల్లో ఉండేలా చూశారని చెప్పారు. ఆడుదాం ఆంధ్రా రాష్ట్ర చరిత్రలోనే అతిపెద్ద క్రీడా సంభరమని ఆంధ్రప్రదేశ్ చరిత్రలో మొట్టమొదటి సారి ఈ ముందడుగు వేసింది జగన్ మాత్రమే స్పష్టం చేశారు. గ్రామీణ స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. సుమారు కోటి మంది రిజిస్ట్రేషన్స్ చేసుకుంటారని అంచనా వేస్తున్నామని చెప్పారు. ఆడుదాం ఆంధ్రాను యువత వినియోగించు కోవాలని పిలుపునిచ్చారు.




Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com